మోసపోయాం..న్యాయం చేయండి

● కోడుమూరు ఏపీజీబీ ముందు దివ్యాంగుల నిరసన...





కోడుమూరు ఏపీజీబీ ముందు నిరసన తెల్పుతున్న దివ్యాంగులు, కమిషనర్‌ను కలిసి సమస్యలను వివరిస్తున్న కాలనీవాసులు

కోడుమూరు రూరల్: తీసుకున్న రుణానికి నెలనెలా బ్యాంకులో కంతులు కట్టేందుకు గ్రూపు సభ్యుడైన బంకు చంద్ర అనే వ్యక్తికి డబ్బులు చెల్లించాం..ఆయన డబ్బులు బ్యాంకులో చెల్లించకుండా మమ్మల్ని మోసం చేశాడు.. బ్యాంకు, పోలీస్ అధికారులు న్యాయం చేయాలంటూ గోనెగండ్ల మండలం బండగట్టుకు చెందిన దివ్యాంగుల గ్రూపు సభ్యులు సోమవారం కోడుమూరు ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు ఎదుట నిరసన తెలిపారు. దివ్యాంగుల సభ్యుల తెలిపిన వివరాలు.. దేవనకొండ మండలం బండగట్టుకు చెందిన దివ్యాంగులు వీరేష్, రాఘవేంద్ర, శ్రీనివాసులు, లక్ష్మీ పొదుపు సంఘంగా ఏర్పడి 2022లో కోడుమూరు ఏపీజీబీలో రూ.4లక్షలు రుణం తీసుకున్నారు. తీసుకున్న రుణానికి గాను నెలనెలా ఒకో సభ్యుడు రూ.3100 ప్రకారం మొత్తం నెలకు రూ.15,500 చొప్పున బ్యాంకులో కట్టేందుకు గ్రూపు సభ్యుడైన బంకు చంద్రకు డబ్బులు చెల్లించారు. అయితే బంకు చంద్ర నెలనెలా బ్యాంకులో డబ్బులు చెల్లించకుండా కాజేశాడు. ఈ విషయంతో గతంలోనూ గ్రూపు సభ్యులు బ్యాంకు, పోలీస్ అధికారులు ఫిర్యాదు చేసినా ప్రయోజనం లేకపోయింది. ఇటీవల ప్రస్తుత బ్యాంకు మేనేజర్, సిబ్బంది డబ్బులు కట్టాలంటూ గ్రూపు సభ్యులకు నోటీసులు జారీ చేశారు. దీంతో సోమవారం గ్రూపు సభ్యులు బ్యాంకు వద్దకు చేరుకుని తాము తీసుకున్న రుణానికిగాను పూర్తిగా డబ్బులు చెల్లించామని, అయితే గ్రూపు సభ్యుడు బంకు చంద్ర బ్యాంకులో డబ్బులు కట్టకుండా మమ్మల్ని మోసం చేశాడని, ఈ విషయంపై గతంలో పనిచేసిన బ్యాంకు మేనేజర్, సిబ్బందికి విన్నవించినా వారు పట్టించుకోలేదని, న్యాయం చేయాలంటూ సీపీఐ నాయకులతో కలిసి బ్యాంకు ముందు బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం బ్యాంకు మేనేజర్ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఐ మండల కార్యదర్శి రాజు, నాయకులు రాముడు, మధు పాల్గొన్నారు.

కర్నూలు (టౌన్) : 'లక్ష్మీనగర్‌లో ఇళ్ల పక్కనే ఖాళీ స్థలాలున్నాయి. వాటిలో మురుగునీరు చేరి పందులకు ఆవాసాలుగా మారాయి. చుట్టుపక్కల వారికి వ్యాధులు దరిచేరకముందే ఖాళీ స్థలాల యజమానులపై చర్యలు తీసుకోవా'లని ఆ కాలనీ మహిళలు రేయోషా, జబీన్, ఖాజమియ్యా నగరపాలక కమిషనర్ రవీంద్ర బాబును కోరారు. సోమవారం స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ కాలనీల నుంచి వచ్చిన ప్రజలు కమిషనర్‌ను కలిసి సమస్యలపై అర్జీలు అందజేశారు. వాటిని ఆయన పరిశీలించి పరిష్కారానికి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని చెప్పారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జీవీ క్రిష్ణ, మేనేజర్ చిన్నరాముడు, ప్రజారోగ్యాధికారి విశ్వేశ్వర రెడ్డి, సిటీ ప్లానర్ ప్రదీప్ కుమార్, ఆర్ ఓ జునీద్, పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

➤ వినాయక్ ఘాట్ మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద తాగునీటి కుళాయి కనెక్షన్ ఇవ్వాలని దుకాణాదారులు భాస్కర్, షేక్షా, వెంకటేశ్వర్లు కోరారు.

➤ లక్ష్మీనగర్‌లో తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని, పక్క వీధిలోకి వెళ్లి నీళ్లు తెచ్చుకుంటున్నామని స్థానికులు శ్రీకాంత్, లక్ష్మన్న, సుమతి కోరారు.

మంజూరైన పనులు ఎందుకు ప్రారంభించడం లేదు

కల్లూరు: మంజూరైన వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించడంలో ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ నంద్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మునిసిపల్ అధికారులను ప్రశ్నించారు. సోమవారం నగరంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ రవీంద్ర బాబును కలిశారు. కల్లూరు అర్బన్ 37వ వార్డులో ఉల్చాల రోడ్డు నుంచిఆదిత్య నగర్ వెళ్లే ఇంటర్నల్ రోడ్డు పనులు రెండు నెలల ముందు మంజూరయ్యాయన్నారు. అయితే, నేటి వరకు ఆ పనులు ప్రారంభించలేదని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. త్వరగా పనులు మొదలు పెట్టి పూర్తి చేయాలని కోరారు.



కమిషనర్ రవీంద్రబాబుతో మాట్లాడుతున్న కాటసాని రాంభూపాల్‌రెడ్డి

పంట నష్టం జాబితాను పకడ్బందీగా రూపొందించాలి

కోడుమూరు రూరల్: మండలాన్ని కరువు మండలంగా ప్రకటించిన దృష్ట్యా పంట నష్ట పరిహారం పొందే రైతుల జాబితాను పకడ్బందీగా రూపొందించాలని మండల వ్యవసాయాధికారి రవిప్రకాష్ రైతు సేవా కేంద్రాల సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మండలంలోని రైతు సేవా కేంద్రాల సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఏఓ మాట్లాడుతూ రబీ సీజన్‌కు సంబంధించి కోడుమూరును ప్రభుత్వం కరువు మండలంగా ప్రకటించిందన్నారు. రబీలో పంట నమోదు చేయించుకున్న రైతుల జాబితాను పరిశీలించి పంటలు నష్టపోయిన వారి జాబితాను గ్రామాల వారీగా రూపొందించాలని చెప్పారు. హెక్టార్ పప్పు శనగ, పొగాకు రూ.10వేలు, జొన్న, కొర్ర పంటలకు రూ.8,500 ప్రకారం ప్రభుత్వం ప్రకటించిందన్నారు. ఏఈఓ తస్లీమా ఉన్నారు.



మాట్లాడుతున్న ఏఓ రవిప్రకాష్

క్లుప్తంగా

పీజీఆర్ఎస్ సమస్యలను పరిష్కరించండి



సి.బెళగల్‌లో పీజీఆర్ఎస్‌ను నిర్వహిస్తున్న అధికారులు

సి.బెళగల్: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు (పీజీఆర్ఎస్‌కు) వచ్చిన అర్జీలను సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఇన్‌చార్జ్ తహసీల్దార్ పురుషోత్తం సూచించా రు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్‌ను నిర్వహించారు. కార్యక్రమానికి ఆయా గ్రామాల నుంచి రైతులు తమ భూ సమస్యల ను, రోడ్డు సమస్యలను పరిష్కరించాలని అధికారులకు అర్జీలు అందజేశారు. అనంతరం ఇన్‌చార్జ్ తహసీల్దార్ మండల అధికారులకు అర్జీల పరిష్కారంపై పలు సూచనలు చేశారు. ఈఓఆర్డీ ఈశ్వరయ్య స్వామి, మండల వ్యవసా య అధికారి మల్లేష్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు గోనేనాయక్, సుమంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

వడగాలులతో జాగ్రత్తగా ఉండండి

కర్నూలు(రూరల్): వాతావరణంలో మార్పుల కారణంగా వీచే వడగాలులతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని కర్నూలు ఆర్డీఓ కిడారి సందీప్ కుమార్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. కర్నూలు రెవెన్యూ డివిజన్ పరిధిలోని ప్రజలు వాతావరణ మార్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎండలు తీవ్రంగా ఉన్న నేపథ్యంలో తాగునీటి సమస్య పరిష్కారానికి డివిజనల్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. నీటి సమస్య ఏర్పడితే కంట్రోల్ రూం నంబర్ 08518 241380కు ఫోన్ చేసి సమస్య తెలియజేయాలని కోరారు.

పండ్లతోటలకు వందశాతం రాయితీ



మాట్లాడుతున్న ఏపీఓ శేషన్న

పాణ్యం: పండ్ల తోటల సాగుకు వందశాతం రాయితీ ఇస్తున్నట్లు ఏపీఓ శేషన్న తెలిపారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్ల తోటల సాగుకు ఆసక్తి గల రైతుల వివరాలు సేకరించాలన్నారు. ముఖ్యంగా ఉద్యాన పంటలైన మామిడి, చీని, సపోట, జామ నిమ్మ , మల్లె, సీతాఫలం తదితర పంటల సాగుకు రాయితీలు కల్పిస్తున్నట్లు తెలిపారు. వీటితో పాటు డ్రిప్ సౌకర్యానికి కూడా రాయితీ ఇస్తున్నామన్నారు. రైతులు దీనిని సద్వినియోగం చేసుకునేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి దివ్య, టెక్నికల్ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలి



ప్రకృతి వ్యవసాయ దిగుబడులను పరిశీలిస్తున్న తహసీల్దార్

పాణ్యం: మండలంలో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరింపజేయాలని తహసీల్దార్ నరేంద్రనాథ్‌రెడ్డి సూచించారు. సోమవారం రెవెన్యూ కార్యాయం వద్ద పీజీఆర్ఎస్‌లో కిచెన్‌గార్డెన్ ఉత్పత్తులను, ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శనకు ఉంచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం ప్రకృతి వ్యవసాయం చేయాల్సిన అవసరం ఉందన్నారు. రసాయన మందులు వాడటం వల్ల పంట పెట్టుబడి పెరగడంతో పాటు పర్యావరణం దెబ్బతింటుందన్నారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్, శ్రీనివాసులు, శేఖర్, పెద్దన్న, నాగేశ్వమ్మ తదితరుల పాల్గొన్నారు.

వాహనదారుడా జాగ్రత్త



సీసీ రోడ్డులో కలిసిపోయిన స్పీడ్ బ్రేకర్లు

కల్లూరు: నగరంలోని సిల్వర్ జూబ్లీ కళాశాల నుంచి జల భవన్ వరకు రెండు విడతలుగా నూతనంగా సీసీ రోడ్డు నిర్మించారు. వేగ నియంత్రణకు అక్కడక్కడక స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. అయితే,వాటిలో కొన్ని స్పీడ్ బ్రేకర్లకు ప్రత్యేక రంగులు వేసి ముందు స్పీడ్ బ్రేకర్ ఉంది అని తెలిపేలా సూచిక బోర్డు ఏర్పాటు చేసి మరికొన్నింటిని అలాగే వదిలేశారు. దీంతో అవి సీసీ రోడ్డులో కలిసిపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.ఏమాత్రం ఆదమరిచినా ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్లను గుర్తించేలా వాటికి ప్ర త్యేక రంగు వేయడంతో పాటు సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

పెండింగ్ బిల్లులను విడుదల చేయాలి



ఎంపీడీఓకు వినతి పత్రం అందజేస్తున్న నాగన్న, శేషయ్య

ఓర్వకల్లు: జాతీయ ఉపాధి హామీ పథకంలో కూలీలకు చెల్లించాల్సిన పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి నాగన్న డిమాండ్ చేశారు. సోమవారం సంఘం మండల ఉపాధ్యక్షుడు శేషయ్యతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు.అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేసిన కూలీలకు గత జనవరి చివరి నుంచి ఇంతవరకు బిల్లులు చెల్లించలేదన్నారు. పనికి వచ్చే కూలీలంతా పేదలని పస్తులు ఉండి ఎంత కాలం పనిచేస్తారని ప్రశ్నించారు. అదేవిధంగా ఉపాధి పనులు చేసే కార్మికులకు ప్రభుత్వం పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లపై సర్కారు స్పందించకపోతే ఉపాధి కూలీలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

హుసేనాపురంలో చోరీ

ఓర్వకల్లు: మండల పరిధిలోని హుసేనాపురం గ్రామంలో ఆదివారం చోరీ జరిగింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలు.. స్థానిక ఏపీజీబీ బ్యాంక్ సమీపంలో గొల్ల దాసరి శ్రీనివాసులు అనే వ్యక్తి కిరాణం దుఖాణం పెట్టుకొని జీవనం సాగించేవాడు. అయితే, వ్యాపారం సరిగా జరగకపోవడంతో కొన్నేళ్ల క్రితం కర్నూలుకు వెళ్లి అక్కడ హోటల్ పెట్టుకొని జీవనం సాగిస్తున్నాడు. హుసేనాపురం ఇంట్లోనే అంతా సామగ్రి ఉంది. దీనిని అదనుగా భావించిన దొంగలు ఆదివారం రాత్రి శ్రీనివాసులు ఇంటి తాళం పగలగొట్టి లోపలికి చొరబడ్డారు. బీరువా పగలగొట్టి అందినకాడికి దోచుకెళ్లారు. గ్రామస్తుల ద్వారా చోరీ విషయం తెలుసుకున్న పోలీసులు సోమవారం బాధితుడిని పిలిపించి విచారణ చేపట్టారు. క్లూస్ టీమ్‌ను రప్పించి వేలిముద్రలు సేకరించారు. బీరువాలో బంగారు, వెండి, నగదు భారీగా ఉన్నట్లు బాధితుడు చెబుతున్నాడు. అయితే అతను చెప్పే మాటలకు పొంతన కుదరకపోవడంతో పోలీసులు విచారణ చేపట్టారు.



దుండగులు బీరువాను పగులగొట్టిన దృశ్యం

డీజేలను నియంత్రించండి

సి.బెళగల్: గ్రామంలో ఊరేగింపుల్లో నిర్వహించే డీజేల నియంత్రణపై చర్యలు తీసుకోవాలని మండలంలోని గొల్లలదొడ్డి గ్రామ పెద్దలు పోలీసులను ఆశ్రయించారు. సోమవారం గ్రామానికి చెందిన తిరుమల్ రెడ్డి, వెంకటేశ్వరగౌడ్, భాస్కర్‌రెడ్డి, చంద్రన్న తదితరులు పోలీస్ స్టేషన్ చేరుకుని హెడ్ కానిస్టేబుల్ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. వారు మాట్లాడుతూ.. వివిధ కార్యక్రమాల పేరుతో గ్రామంలో ఊరేగింపులు నిర్వహించే సమయంలో డిజేలు వినియోగిస్తున్నారని అర్ధరాత్రి దాటినా ఊరేగింపులు ముగించకపోతుండటంతో భారీ శబ్దాలతో ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. ముఖ్యంగా గుండె సంబంధ వ్యాధులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చర్యలు తీసుకోవాలని కోరారు. జగన్‌మోహన్‌రెడ్డి, మన్సూర్, కృష్ణమూర్తి, చంటి, వెంకటేశ్వర్లు ఉన్నారు.



పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న గొల్లలదొడ్డి గ్రామస్తులు

ప్రశాంతంగా మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షలు





ఏపీ మోడల్ స్కూల్‌లో పరీక్షలు రాస్తున్న విద్యార్థులు,సి.బెళగల్ మోడల్ స్కూల్ పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

పాణ్యం: మండలంలోని ఏపీ మోడల్ స్కూల్‌లో ఆరో తరగతి చదివేందుకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు సోమవారం నిర్వహించిన ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. మొత్తం 69మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 59 మంది పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ దినేష్ తెలిపారు.

సి.బెళగల్: స్థానిక మోడల్ స్కూల్లో సోమవారం నిర్వహించిన ఆరవ తరగతి ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా ముగిసినట్లు పాఠశాల ప్రిన్సిపల్ వంశీమోహన్ తెలిపారు. పాఠశాలలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన పరీక్షకు 82 మంది విద్యార్థులకు గాను 71 మంది హాజరు కాగా, 11 మంది గైర్హాజరయ్యారని ప్రిన్సిపాల్ తెలిపారు. కాగా పాఠశాలలో వంద మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉండగా, 82 మంది విద్యార్థులు మాత్రమే దరఖాస్తులు చేసుకున్నారని చెప్పారు.

వక్ఫ్ చట్టంపై అపోహలు వద్దు

కర్నూలు కల్చరల్: వక్ఫ్ చట్టంపై అపోహలు పడాల్సిన అవసరం లేదని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినూషా రెడ్డి అన్నారు. సోమవారం బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వక్ఫ్ చట్టానికి సంబంధించిన అంశాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ముస్లింలను ఓటు బ్యాంక్ రాజకీయాలకోసమే వాడుకుందని ఆరోపించారు. వక్ఫ్ చట్ట సవరణతో ముస్లింల ఆస్తులకు రక్షణ కల్పించినట్లైందన్నారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి డాక్టర్ వినీశ్వర్ రెడ్డి మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర నాయకురాలు గీతామాధురి, మైనార్టీ మోర్చ నాయకులు కాన్సాప్, మల్లేష్ నాయుడు, నాయకులు నాగరాజు, సాయి ప్రదీప్, శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

23న జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్) : ఈనెల 23 వ తేదీన స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో జిల్లా స్థాయి ఉషూ ఎంపిక పోటీలు పురుష, మహిళలకు వేర్వేరుగా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉషూ సంఘం కార్యదర్శి టి. శ్రీనివాసులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 7 సంవత్సరాల నుంచి 14 సంవత్సరాల వరకు సబ్ జూనియర్ విభాగం, 15 సంవత్సరాల నుంచి 17 సంవత్సరాల వరకు జూనియర్స్ విభాగం, 18 సంవత్సరాల నుంచి 40 సంవత్సరాల లోపు సీనియర్స్ విభాగమన్నారు. ఆయా విభాగాల్లో పాల్గొనదలచిన వారు వెంట ఆధార్ కార్డు తెచ్చుకొని ఎంపిక పోటీల్లో పాల్గొనాలని తెలిపారు. ఎంపికయిన క్రీడాకారులు వచ్చే నెల 5 వ తేదీ విజయవాడలో జరిగే సబ్ జూనియర్ రాష్ట్ర స్థాయి ఉషూ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

అధికారులేరీ?



కర్నూలు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రఘునాథ్ ఒక్కరే ఉన్న దృశ్యం

కర్నూలు(రూరల్): ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కర వేదిక కార్యక్రమాన్ని పలువురు అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారు. కార్యక్రమానికి హాజరు కాకపోతుండటంతో వివిధ సమస్యలతో వచ్చిన పలు గ్రామాల ప్రజలు వెనుదిరుగుతున్నారు. కర్నూలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి ఎంపీడీఓ రఘునాథ్ తప్ప ఇతర అధికారులెవరూ హాజరు కాలేదు. కొందరు మాత్రం రిజిష్టర్లలో సంతకాలు చేసి అటు నుంచి అటే వెళ్లిపోతున్నారు. ఎంతో దూరం నుంచి తమ సమస్యలను చెప్పుకోవడానికి వచ్చిన గ్రామీణులు ఖాళీ కుర్చీలను చూసి అసంతృప్తి వ్యక్తం చేస్తూ నిరాశగా వెనుదిరుగుతున్నారు.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



మృతి చెందిన మల్లయ్య

ఓర్వకల్లు: ఇంటి నుంచి జీవాల వద్దకు వెళ్లిన ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో ఆదివారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకొంది. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన బోయ మల్లయ్య (48) అనే వ్యక్తి తమ జీవాలను ఊరు వెలుపల ఆపుకొని, రోజు వాటికి కాపలాగ వెళ్లేవాడు. రోజులాగే ఆదివారం రాత్రి జీవాల మంద వద్దకు తన భార్య మల్లీశ్వరితో కలిసి వెళ్లాడు. తర్వాత అన్నం తేవడానికి భార్య ఇంటికి వెళ్లి వచ్చేలోపు మల్లయ్య విగతజీవిగా పడి ఉన్నాడు. ఈ విషయం పోలీసులకు తెలియజేయడంతో వారు సంఘటనా స్థలానికి చేరుకొని మల్లయ్య మృతి చెందిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య మల్లీశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ సునీల్ కుమార్ తెలిపారు.

కార్మికులకు అండగా ఐఎన్‌టీయూసీ

కర్నూలు(సెంట్రల్): ఐఎన్‌టీయూసీ కార్మికులకు అండగా నిలుస్తుందని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బతుకన్న పిలుపునిచ్చారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సుమారు 120 మంది కార్మికులు ఆ యూనియన్‌లో చేరారు. ఈసందర్భంగా వారికి బతుకన్న, మాజీ ఎమ్మెల్సీ సుధాకరబాబు కండువాలు కప్పి ఆహ్వానించారు. ఐఎన్‌టీయూసీలో చేరిన కిషోర్‌ను ఆ సంఘంజిల్లా ప్రధాన కార్యదర్శిగా నియమించారు.

ముంచిన వర్షం..

కోడుమూరు రూరల్: అకాల వర్షం, భారీ ఈదురు గాలులకు కొర్ర పంట నేలవాలింది. కోడుమూరు మండలంలో గాజులదిన్నె ప్రాజెక్టు ఎడమ కాల్వ కింద ఆరుతడి పంటగా 300కుపైగా ఎకరాల్లో కొర్ర పంట సాగు చేశారు. ప్రస్తుతం పంట చేతికి రావడంతో రైతులు కోతలు కోసేందుకు సిద్ధమవుతున్నారు. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు వీచిన భారీ ఈదురుగాలులు, అకాల వర్షానికి చేతికొచ్చిన కొర్ర పంట నేలవాలడంతో, గింజలు రాలిపోయాయి. దీంతో తమకు తీవ్ర నష్టం వాటిల్లిదంటూ రైతులు వాపోతున్నారు. పంట సాగుకు ఎకరాకు రూ.10వేల వరకు ఖర్చు వస్తుందని రైతులు పేర్కొన్నారు.



కోడుమూరు వద్ద నేలవాలిన కొర్ర పైరు

హోరాహోరీగా ఎడ్ల బండలాగుడు పోటీలు

● ప్రథమ స్థానంలో నిలిచిన కానాల గ్రామ ఎడ్లు

ఓర్వకల్లు: మండలంలోని లొద్దిపల్లె గ్రామంలో వృషభాల బండలాగుడు పోటీలు హోరాహోరీగా సాగాయి. ఈస్టర్ పండుగను పురస్కరించుకుని స్థానిక ఏబీఎం సంఘ పెద్దల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఈ పోటీలను సంఘ కాపరి రెవ.పి.ఎస్ జాన్ ప్రారంభించారు. మొత్తం 11 ఎడ్ల జతలు పాల్గొనగా సంజామల మండలం కానాల గ్రామానికి చెందిన గుండం చెన్నారెడ్డి వృషభాలు నిర్ణీత సమయానికి 5,258 అడుగుల దూరం లాగి మొదటి స్థానంలో నిలిచి రూ.60 వేల నగదు బహుమతి పొందాయి. నాగర్ కర్నూలు జిల్లా లింగాల మండలం రాయవరం గ్రామానికి చెందిన రామచంద్రారెడ్డి వృషభాలు 5,244 అడుగులు లాగి రెండో స్థానంలో నిలిచి రూ.40 వేలు, కర్నూలు మండలం బి.తాండ్రపాడు గ్రామానికి చెందిన ఆకెపోగు వరలక్ష్మి వృషభాలు 5,236 అడుగులు లాగి మూడోస్థానంలో నిలిచి రూ.30 వేలు, పసుపుల శేఖర్, రాయల చెరువు రామచంద్రారెడ్డి(సంయుక్త జత) వృషభాలు 5,124 అడుగులు లాగి నాలుగో స్థానంలో నిలిచి రూ.20 వేలు, కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన శశాంక్, శ్రేయ వృషభాలు 5,110 అడుగులు లాగి ఐదో స్థానంలో నిలిచి రూ.10 వేలు, గద్వాల జిల్లా ఉండవల్లి మండలం కంచుపాడు గ్రామానికి చెందిన ఆంజనేయ రెడ్డి వృషభాలు 5,100 అడుగులు లాగి ఆరో స్థానంలో నిలిచి రూ.8 వేలు నగదు బహుమతులు సాధించాయి. ఈ పోటీలకు వాడాల రామనాయుడు వ్యాఖ్యాతగా వ్యవహరించగా ఏబీఎం సంఘ పెద్దలు ప్రకాశం, సత్యాలు, మధుమోహన్, రవి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



రాతి దూలం లాగుతున్న వృషభాలు

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు

కల్లూరు: లక్ష్మీపురంలోని మైనార్టీ కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఇంటర్ మొదటి, రెండవ సంవత్సరాల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించింది. సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్)లో అత్యధిక మార్కులు సాధించిన బి. శిరీషా, ఎ. మనీషా అనే విద్యార్థినులను కార్పొరేటర్ నారాయణరెడ్డి, రవీంద్ర విద్యాసంస్థల అధినేత పుల్లయ్య, మాజీ జెడ్పీ చైర్మన్ ఎ. వెంకటస్వామి సన్మానించారు. విద్యార్థినులతో పాటు తల్లిదండ్రులు, ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులను కూడా సత్కరించారు. అనంతరం ముఖ్య అతిథులు మాట్లాడుతూ పట్టుదల, క్రమశిక్షణ ఉంటే విద్యార్థులు ఏదైనా సాధించగలరన్నారు. చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. అనంతరం ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు కొంత మొత్తం ఆర్థిక సహాయం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఉమాదేవి, ఉపాధ్యాయులు, లక్ష్మీపురం గ్రామ పెద్దలు పుల్లారెడ్డి, రామిరెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ షేక్షావలి, తదితరులు పాల్గొన్నారు.



ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినులను సన్మానిస్తున్న ముఖ్య అతిథులు

గార్గేయపురం చెరువులో దూకుతున్న యువకుడు



సరదా సమయం..

కర్నూలు(రూరల్): ఓ వైపు ఒంటి పూట బడులు.. మరో వైపు మండుతున్న ఎండలు.. ఇంట్లో క్షణం కూడా ఉండలేని పిల్లలకు ఈ వాతావరణం ఇబ్బందే. అయినా తీరిక చేసుకొని మిత్రులంతా కలిసి సరదాగా గడిపేందుకు యత్నిస్తున్నారు. ఇందులో భాగంగా ఈతకెళ్తున్నారు. మధ్యాహ్నం బడి ముగిసిన వెంటనే మిలటరీ కాలనీ, నందన పల్లె, వెంకాయ పల్లె, కర్నూలు నగర విద్యార్థులంతా కర్నూలు నగర శివారులోని గార్గేయపురం చెరువుకు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు ఈతకు వెళ్తున్నారు. సరదాగా ఈత కొడుతూ ఉల్లాసంగా గడుపుతున్నారు. అయితే ఈత సమయంలో జాగ్రత్తలు పాటించాలని పలువురు సూచిస్తున్నారు.